## క్లుప్తంగా

### దసరా క్రికెట్ విజేత 'బేతంచెర్ల హంటర్స్'



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో దసరా పండుగ సందర్భంగా బేతంచెర్ల హంటర్స్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. టోర్నీలో మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో బేతంచెర్ల సంతోష్ ఎలెవన్‌పై ఒక్క రన్ను తేడాతో హంటర్స్ జట్టు విజయం సాధించింది. నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి సహకారంతో విజేత జట్టుకు రూ.20,000, రన్నర్ జట్టుకు శంకర్ నాయక్, లక్ష్మణ్ సహకారంతో రూ.10,000 నగదు, ట్రోఫీలు అందజేశారు. బహుమతులను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, జాకీర్, ఎద్దులన్న చేతుల మీదుగా అందజేశారు.

### సేవాగుణం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం ఉపాధ్యక్షురాలు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ అన్నారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియ ఆదివారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కో వ్యక్తికి రూ. 100 చొప్పున పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, సభ్యులు సుబ్బయ్య, రాములమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

బేతంచెర్ల: జిల్లా కేంద్రమైన కర్నూలులో శనివారం జరిగిన అండర్-14 తైక్వాండో పోటీల్లో బేతంచెర్లకు చెందిన విద్యార్థినులు శ్రీవల్లి రెడ్డి, దివ్యశ్రీ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వారిని తల్లిదండ్రులు, కోచ్‌లు వెంకటేశ్వర్లు, నాగన్న ఆదివారం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

### చౌడేశ్వరి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కోసం ఇదే గ్రామానికి చెందిన కీశేలు మొదుళ్ల రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనువరాలు గోమైదిలిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.25,516 విరాళం ఇచ్చారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అర్చకులకు విరాళం అందజేశారు. దాతలకు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

### శుభకార్యం



వధూవరులతో కాటసాని, పాపిరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని ధనలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ సర్పంచ్ బండి వరలక్ష్మీ, బండి బ్రహ్మానందరెడ్డి దంపతుల కుమారుడు బండి మహిధర్‌రెడ్డి వివాహ వేడుక జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ నాయకులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, అంబటి రవి కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### ప్రయాణికుడిపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

నందికొట్కూరు: పట్టణంలోని పటేల్ సెంటర్‌లో నిలబడి ఉన్న ప్రయాణికుడిపై ఆత్మకూరు ఆర్టీసీ బస్సు దూసుకెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కర్నూలు నుంచి ఆత్మకూరు వెళ్తుండగా బస్సెక్కడానికి రోడ్డుపై నిలిచిన జూపాడుబంగ్లా మండలం తాటిపాడు గ్రామానికి బొల్లవరం శేషన్న కాళ్లపైకి ముందు చక్రం ఎక్కినట్లు ప్రయాణికులు తెలిపారు.

# రెడ్‌బుక్‌కు భయపడేది లేదు

- పార్టీ కోసం కష్టపడే వాళ్లకు గుర్తింపు
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కొలిమిగుండ్ల: కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసేందుకు రెడ్‌బుక్ తీసుకొచ్చారని.. దానికి భయపడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ఆదివారం కొలిమిగుండ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి వివిధ అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే వాళ్లకు భవిష్యత్‌లో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కూటమి నేతలు రాజకీయ కక్షతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ప్రతి చిన్న విషయానికి కేసులు నమోదు చేయించి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఇకపై భరించే రోజులు పోయాయని అందుకే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారన్నారు. అన్యాయం జరిగిన ప్రతి కార్యకర్త ఇందులో నమోదు చేయాలని సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి తప్ప టీడీపీ నాయకులను ఇబ్బందులకు గురి చేసిన దాఖలాలు లేవన్నారు.

**మైనింగ్ ప్రైవేట్‌కు అప్పగించారు**

కూటమి ప్రభుత్వం మైనింగ్‌ను ప్రైవేట్‌కు అప్పగించిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ పరం చేయాలని భావించడంతో ఇక్కడి పరిస్థితులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మినహాయింపు ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో ప్రగల్భాలు పలికిన నాయకులు ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇప్పుడు ప్రైవేట్ పరం చేస్తుంటే ఎక్కడున్నారు..ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చివరకు మట్టి తీసుకుపోవాలన్నా డబ్బులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. త్వరలోనే మైనింగ్ ద్వారా రౌడీ మామూలు తరహాలో వసూలు చేసేందుకు అంతా సిద్ధమైందని చెప్పారు. గ్రామాల్లో టీడీపీ నాయకులు స్థలాలు, గనులు ఆక్రమించుకుంటున్నారని మండిపడ్డారు. అక్రమ మైనింగ్‌లకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకుల గనులు, వాహనాలపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేయించి కేసులు పెట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులు పడిన ఇబ్బందులను తప్పక డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని కోరారు. పార్టీ పటిష్టంగా ఉంటే ప్రజలు మనవైపు వస్తారని అన్నారు. ఎన్నికల నాటికి పార్టీని తిరుగులేని శక్తిగా చేసుకుందామని పిలుపునిచ్చారు.

**అభివృద్ధిని గాలికొదిలేశారు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తవుతున్నా అభివృద్ధిని గాలికొదిలేసిందని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆరోపించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులు చేయాలన్న ఆలోచన చేయలేదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో బనగానపల్లె నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ కింద వంద కోట్లతో పనులు జరిగాయని గుర్తు చేశారు. పరిపాలనను గ్రామ స్థాయికి తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కిందన్నారు. రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న తేడాను గ్రామాల్లో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, మొలక రాజారెడ్డి, సులోచన, మూల ఈశ్వరరెడ్డి, కామిని ప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బాచం మహేశ్వరరెడ్డి, దస్తగిరి, సోమశేఖర్‌రెడ్డి, గుర్విరెడ్డి, తోట మల్లేశ్వరరెడ్డి, పేరం రాంశంకర్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, ఓబులేసు, జగన్‌మోహన్‌రెడ్డి, రామనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ



ఆకుమల్లలో బాధితులను పరామర్శిస్తున్న కాటసాని, పాపిరెడ్డి

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వేమిరెడ్డి రమణారెడ్డి, తల్లి వేమిరెడ్డి లక్ష్మీదేవి ఇటీవల బైక్‌పై వెళ్తుండగా రోడ్డుప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆదివారం ఆకుమల్లకు చేరుకుని వారిని పరామర్శించారు. వారిని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట పార్టీ నాయకులు కాటసాని తిరుపాల్ రెడ్డి, గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, ఉయ్యాలవాడ ఖాశిం బాషా, పేరం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### మద్యం విక్రేత అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామానికి చెందిన తలారి వెంకటేశ్వర్లు అక్రమంగా బెల్ట్ షాప్ ద్వారా మద్యం విక్రయిస్తుండగా ఎస్‌ఐ రమణయ్య ఆ దివారం అరెస్ట్ చేశారు. సమాచారం మేరకు దాడి చేసిన పోలీసులు 50 క్వార్టర్ బాటిల్స్‌ను స్వా ధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్

బనగానపల్లె రూరల్: విద్యా రంగ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ కోరారు. ఆదివారం స్థానిక ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు పరిష్కారం లభించలేదన్నారు. అలాగే, రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బనగానపల్లె పట్టణంలో పెండింగ్‌లో ఉన్న బీసీ గురుకుల పాఠశాల భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని, ఇక్కడ బీటెక్ కళాశాలను ఏర్పాటు చేస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీని నెరవేర్చి పేదలకు ఉన్నత చదువులు చదివే అవకాశం కల్పించాలని కోరారు. సంఘం నాయకులు సుంకయ్య, బాలకృష్ణ, శివయ్య, చందు, శ్రావణ్, బ్రహ్మం, సుదర్శన్, కిరణ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారం



మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి

బనగానపల్లె రూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బనగానపల్లె, కోవెలకుంట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డుల చైర్మన్లు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, జి.మధు, పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా ఎన్నికై న మార్కెట్ కమిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు మార్కెట్ యార్డుల అభివృద్ధికి కృషి చేయాలని, రైతుల సంక్షేమం కోసం మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

## వాల్మీకి జయంతిని విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నేతలు

బేతంచెర్ల: మండలంలో ఈ నెల 7న జరగనున్న వాల్మీకి జయంతిని విజయవంతం చేయాలని ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి భవనంలో సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు రాముడు, వెంకటేశ్వర్లు, మద్దయ్య, నాగార్జున, మురళీకృష్ణ, నాయుడు, నాగరాజు మాట్లాడారు. గ్రామాల వారీగా ఉదయం వేడుకలు జరిపి, మధ్యాహ్నం నుంచి పట్టణంలో వాల్మీకి మహర్షి గ్రామోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

### వ్యవసాయానికి విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

**సంజామలలో..**

సంజామల: మండల పరిధిలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాలకు ఈ వారం పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, వసంతాపురం, ఆల్వకొండ, రెడ్డిపల్లె, కమలపురి, కానాల, గిద్దలూరు, అక్కంపల్లె, ఆర్.లింగందిన్నెకు గ్రామాలకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

### శిథిలావస్థలో విద్యుత్ కార్యాలయం



బనగానపల్లె: బనగానపల్లె ప్రాంతాన్ని నవాబులు పరిపాలించిన కాలంలో సుమారు 80 ఏళ్ల క్రితం నిర్మించిన విద్యుత్ రూరల్ కార్యాలయం అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ పని చేసే సిబ్బంది విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయం పరిధిలో ఇల్లూరుకొత్తపేట, కైప, నందవరం, పలుకూరు, నందివర్గం సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిపరిధిలో సుమారు 3వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, మరో 18వేల వరకు నాపరాతి, ఇతర పరిశ్రమలు, గృహ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ వినియోగదారులు నిత్యం ఏదో అవసరాల కోసం కార్యాలయం వద్దకు వస్తుంటారు. ప్రమాదం పొంచి ఉన్న ఈ కార్యాలయం వద్దకు వారు రావడంలో భయందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ విద్యుత్ ఏడీఈ, టౌన్ ఏఈ కార్యాలయాన్ని నూతనంగా నిర్మించిన అధికారులు, రూరల్ కార్యాలయాన్ని మరచారని విమర్శలు ఉన్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు అవసరమైన చర్యలు తీసుకొని నిధులు మంజూరు చేసి రూరల్ ఏఈ కార్యాలయం నిర్మించాల్సిన అవసరం ఉంది.

## గొడవలకు దూరంగా ఉండాలి



కానాల గ్రామంలో ప్రజలతో మాట్లడుతున్న సీఐ హనుమంత్ నాయక్

సంజామల: అల్లర్లు, గొడవలకు దూరంగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంత్ నాయక్ సూచించారు. ఆదివారం కానాల గ్రామంలో ఎస్‌ఐ రమణయ్యతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఎవరైన అనుమానితుల కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ లేదా ఓటీపీలు ఇవ్వొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బుడగ జంగాల సమస్యలు పట్టని ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

డోన్ టౌన్: బుడగ జంగాల కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని నక్కి రామన్న భవనంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. దీని వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు అవకాశాలు పొందలేకపోతున్నారని తెలిపారు. అలాగే కర్నూలు-అనంతపురం జాతీయ రహదారిలో గుంతల మరమ్మతు పనులను ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే వాహనదారులు టోల్ గేట్ ఫీజులు చెల్లించరని హెచ్చరించారు.





సీతారామాపురం ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, అంబాపురం రహదారిలో..

## ప్రమాదకరంగా పిచ్చి మొక్కలు



బేతంచెర్ల నుంచి వెల్దుర్తి రోడ్డులో..

బేతంచెర్ల: మండలంలోని సీతారామాపురం, అంబాపురం, బేతంచెర్ల నుంచి వెల్దుర్తి, బనగానపల్లె వైపుకు వెళ్లే రహదారుల పక్కన పిచ్చిమొక్కలు, గడ్డి అధికంగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురవడంతో పిచ్చి మొక్కలు పెరిగి మలుపుల వద్ద ఎదురు వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారుల పక్కన మొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## నాడు కళకళ.. నేడు వెలవెల

- నగరవనంపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- జీతాలు రాక మానుకున్న ఉద్యోగులు
- పాడైపోయిన ఆట వస్తువులు



నాడు.. చిన్నారుల కేరింతలు



నేడు.. శిథిలమైన జారుడు బల్ల

డోన్: పట్టణ శివారులోని ఎర్రగుంట్ల గ్రామం వద్ద రూ.6 కోట్ల అటవీ శాఖ నిధులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బుగ్గన శేషారెడ్డి నగరవనం కూటమి పాలకుల నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి బలైపోయింది. అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మానసపుత్రికగా నిలిచిన ఈ నగరవనం ప్రస్తుతం పాడైపోవడంతో, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కు నిర్వహణ సక్రమంగా లేక చిన్నపిల్లలు ఆడుకునే ఆటవస్తువులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. రెండేళ్ల క్రితం పది మంది పనివారితో కళకళలాడిన నగరవనం నేడు వాచ్‌మన్‌కి కూడా జీతాలు ఇవ్వకపోవడంతో దిక్కులేని స్థితికి చేరింది. కోట్లాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసినట్లు అయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వనరక్షణ సమితి పథకం కింద మంజూరైన నిధులతో పాటు సందర్శకుల నుంచి వసూలు చేసిన లక్షల రూపాయలు ఉన్నప్పటికీ, ఉద్యోగుల జీతాలు చెల్లించకపోవడంతో 9 మంది వర్కర్లు పనులు మానేశారు. ఫలితంగా ఒకప్పుడు సందర్శకులతో నిండిపోయిన నగరవనం నేడు వెలవెలబోతోంది. ప్రతి వారాంతంలో వేలాదిరూపాయలు వసూళ్లవుతున్న నగరవనం నేడు అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనికిరాకుండా పోయిందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పూర్వ వైభవం తిరిగి తెచ్చేందుకు అదనపు నిధులు కేటాయించి, బకాయిలు చెల్లించి వనం అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



నాడు.. సందర్శకులతో కళకళలాడుతున్న నగరవనం,



కిందపడిపోయిన రంగులరాట్నం సీట్లు

## గుంతలమయమైన రోడ్లు



ఇందిరానగర్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

డోన్: పట్టణంలోని పలు రహదారులు శిథిలమై పాదచారులు, వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. ఇందిరానగర్ ఆంజనేయస్వామి గుడి ఎదురుగా కంబాలపాడు-కోడుమూరు రహదారి దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తారకరామనగర్ పెట్రోల్‌బంకు ఎదురుగా ఉన్న డ్రైనేజీ బ్రిడ్జి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా గుంతలు ఏర్పడడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## శిథిలావస్థలో సీసీరోడ్డు



పద్మనాభస్వామి ఆశ్రమ ఆర్చీ సమీపంలో దెబ్బతిన్న సీసీరోడ్డు



చౌడేశ్వరీదేవి ఆలయం వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు

కోవెలకుంట్ల- ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలోని భీమునిపాడు గ్రామం వద్ద సీసీరోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. చౌడేశ్వరీదేవి ఆలయం నుంచి పద్మనాభస్వామి ఆశ్రమ ఆర్చీ వరకు ఉన్న సీసీ రోడ్డు పలు చోట్ల గుంతలతో దర్శనమిస్తోంది. రాత్రి సమయాల్లో ప్రధాన రహదారిపై గుంతలు కనిపించక పోవడంతో ద్విచక్ర వాహన చోదకులు కింద పడి గాయపడిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. -కోవెలకుంట్ల